కొత్త పింఛన్ల వెలుగు


తన ఇంటి కొలత సమస్య తీరి కొత్తగా పింఛను పొందిన జానీసాహెబ్

పలమనేరు: మున్సిపాలిటీలోని గంటావూరు సచివాలయ పరిధిలో ని జానీసాహెబ్ అనే వృద్ధుడికి గతంలో పింఛను రాలేదు. వీరి ఇంటి ప్రహరీ గోడతో స హా కొలతలు వేయ డంతో ఎక్స్‌స్టెప్ వ్యాలిడేషన్‌లో పింఛను రాకుండా పోయిం ది. దీంతో ఆయన సచివాలయ సిబ్బందికి దరఖాస్తు చేసుకుని మళ్లీ ఇంటి కొలతలు వేయించాడు. దీంతో ఇంటిని మాత్రమే కొలిచి, ఆపై ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఆ కుటుంబం అన్ని పథకాలను అర్హత సాధించింది. దీంతో ఆయనకు కొత్త పింఛను(ఓఏపీ) రూ.2750 అందింది. అతని భా ర్య నూర్జహాన్‌కు వైఎస్సార్ చేయూత ద్వారా రూ. 18,750, ఆటో డ్రైవర్ అయిన ఆయన పెద్దకుమారుడికి వాహనమిత్ర ద్వారా రూ.10వేలు, తోపుడుబండిపై వ్యాపారం చేసే చిన్న కుమారుడికి జగనన్న తోడు ద్వారా రూ.10వేలు, గ్రూపులో ఉన్న ఆయన భార్యకు సున్నా వడ్డీ, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే ఆయన మనవడికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ.. ఇలా ఆ కుటుంబం పలు పథకాల ప్రయోజనాలు పొందింది. ప్రతినెలా పింఛను తీసుకుంటున్నప్పుడు ఆయనలో చెప్పలేనంత ఆనందం. ఇది ప్రభుత్వం ఇస్తోన్న డబ్బు..తన అవసరాలకు వాడుకోవడంలోనే ఎంతో ఆనందం ఉందంటున్నాడా పింఛనుదారుడు. అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలకతీతంగా ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిన సామాజిక పింఛన్లకు తోడు కొత్తగా మంజూరు చేస్తున్న పింఛన్లు మరెందరికో జీవనానికి ఆధారమయ్యాయి.



పలమనేరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్లు, (ఇన్‌సెట్) పలమనేరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్

నాటి టీడీపీలో పింఛన్లు అంత సులువు కాదు

గత టీడీపీ పాలనలో కొందరికే పింఛన్లు అందేవి. ఎవరైనా పింఛనుదారుడు మరణిస్తేగానీ ఆ స్థానంలో కొత్తగా పింఛను మంజూరు చేసేవారు కాదు. చావుకు –పింఛన్ల మంజూరుకు ఇలా లంకె పెట్టిన వైనం ఎంత దారుణంగా ఉండేదో ఇట్టే బోధపడు తుంది. అది కూడా జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పార్టీలు, కులాలు, రాజకీ యాలు, దళారులతో పని లేకుండా అర్హులైతే చాలు పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఏడాదంతా సచివాలయాల్లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటోం ది. ఈ నెలకు సంబంధించి నియోజకవర్గంలో కొత్తగా 1,545 పింఛన్లు మంజూరు అయ్యాయం టే ఎంత సునాయాసంగా పింఛన్లు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇదీ టీడీపీ పాలనకు, వైఎ స్సార్ సీపీ పాలనకు ఉన్న తేడా.

ప్రతినెలా ఒకటో తేది తెల్లవారకముందే..

గతంలో టీడీపీ పాలనలో పోస్టాఫీసుకు వెళ్లి పింఛన్లు పొందేందుకు వృద్ధులు, వికలాంగులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొన్ని గ్రామీణ ప్రాంతాల నుంచి పోస్టాఫీసుకు రవాణా సౌకర్యాలు లేక వారు చాలా ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా అక్కడ సెల్ నెట్‌వర్క్ రాకుంటే ఆ రోజు పింఛన్లు ఇచ్చేవారు కాదు. ఒకటో తేదీ ఇవ్వాల్సిన పింఛన్లు సగం నెలా పూర్తయినా అందరికీ చేరేవి కాదు. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో వలంటీర్లు పింఛను దారుల ఇంటికే వెళ్లి పింఛన్లు ఇస్తున్నారు. మూడు రోజుల్లోపే వందశాతం పంపిణీ చేస్తుండడంతో పింఛనుదారులకు ఒక నిశ్చింత, భరోసా కలిగింది.

నియోజకవర్గంలో పింఛన్లు

మండలం	నాలుగేళ్లలో పింఛన్లు	కొత్త పింఛన్లు
పలమనేరు	4700	114
పలమనేరు మున్సిపాలిటీ	4400	161
గంగవరం	8159	179
పెద్దపంజాణి	8461	304
బైరెడ్డిపల్లె	7800	383
వీ.కోట	10,700	404
మొత్తం	44,220	1,545

జగనన్న పింఛన్ నా ప్రాణాన్ని కాపాడుతోంది

గంగవరం: నా పేరు మోహన. కీలపట్లలో ఉంటున్నా. నాకు భార్య, ముగ్గురు పిల్లలు. కుమార్తెకు వివాహమైంది. కొడుకులిద్దరూ కూలి పనులకు వెళ్తున్నారు. నేను మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నా. 5 నెలలుగా డయాలసిస్ చేసుకుందనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వేలల్లో ఖర్చు అవుతోంది. అంత స్థోమత లేక, ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పొందలేక ఇక నేను బతకనేమో అనుకున్నా. వలంటీర్ చేత పింఛన్ కోసం సచివాలయంలో అర్జీ పెట్టుకున్నా. ఈ నెల నుంచి నాకు రూ.10 వేలు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. దీంతో ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ చేసుకుంటున్నా. నా లాంటి ఎంతో మంది అభాగ్యులను ఈ ప్రభుత్వం ఆదుకుంటోంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా.

ఈ పింఛనేనయ్యా నాకు గతి



మా ఆయన నరసింహులు చానా ఏండ్లకు ముందే చనిపోయాడు. నాకు ఒకే ఆడబిడ్డ. ఆమెకు పెళ్లిచేసి పంపా. ఇంట్లో నేనొక్కద్దాన్నే ఉండేది. నా వయసు ఇప్పుడు 70 ఏండ్లు. నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఇలు పెద్దదని, కరెంట్ చార్జీలు ఎక్కువని నాకు పింఛను రాలేదు. మా సచివాలయ సార్లకు నా బాదలు చెప్పుకున్నా. వాళ్లే అన్ని పనులూ చేసి నాకు కొత్త పింఛను వచ్చేలా చేసినారు. పాత పెంకుటింట్లో కరెంటు లేకున్నా, బుడ్డిదీపంతో ఉన్నా. ఏం భయం లేదు. ఇక నుంచి నెలనెలా నాకు పింఛను వస్తుంది. కావాల్సిన మందులు, సరుకులు తీసుకుంటా. పింఛను ఉందనే ధైర్యంతో బతుకుతున్నా. నా బిడ్డలాంటి జగన్‌కు బాగుండాలయ్యా

–నక్క చినపాప, గొబ్బిళ్లకోటూరు, పలమనేరు మున్సిపాలిటీ

ఒంటరి బతుక్కి పింఛనే ఆధారం సామీ



నా భర్త చనిపోయాడు, వయసు 50 ఏండ్లు. ఒంటరిగానే ఉంటున్నా. ఆరోగ్య సమస్యలతో పనులకు వెళ్ల లేదు. ఇంతకుముందోసారి ఒంటరి మహిళ పింఛనుకు పెడితే వయసు చాలదన్నారు. అయితే ఇప్పుడా పింఛను వచ్చింది. దీంతో నాకు ధైర్యం వచ్చింది. ఇక ఎలాగైనా బతికేస్తాననే నమ్మకం ఉంది.

–జయంతి, గంటావూరు కాలనీ, పలమనేరు

క్లుప్తంగా

చిరు వ్యాపారులకు ఎల్ఈడీ లైట్లు


తోపుడు బండ్ల వ్యాపారులకు ఎల్ఈడీ లైట్లు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారి పల్లె గ్రామ పంచాయతీలో తోపుడు బండ్ల వ్యాపారులకు ఎల్ఈడీ లైట్లను సచివాలయ కన్వీనర్ కోటా వెంకటరమణ శుక్రవారం పంపిణీ చేశారు. చింతగుంట అయేషా, మర్రిపాడు చిన్నబ్బ, కళావతికి ఎల్ఈడీ లైట్లను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిబాబు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కిషోర్ పాల్గొన్నారు.

యూరియా తగినంత వాడితేనే వరికి మేలు

గంగవరం: వరి పంటకు యూరియా తగినంత మాత్రమే వేయాలని, అధికంగా వేస్తే తెల్లజీడ వంటి తెగులు బారిన పడి, పంట దెబ్బతినే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఎకరా విస్తీర్ణంలో వరి నాట్లు, పిలకలు, కుప్పలకు మొత్తానికి కలిపి 90 కిలోలు మాత్రమే యూరియా వాడాలని సూచించారు. అంతకు మించి వాడితే పంట దెబ్బతింటుందన్నారు.

దళితుల మహా ధర్నా జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

పలమనేరు: దళితుల హక్కుల రక్షణ కోసం ఈ నెల 29న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన దళితుల మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక కుల వివక్ష పోరాట కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరులో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు ఈశ్వర్, ఓబుల్‌రాజు, ఐద్వా నాయకురాలు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న నాయకులు

శాంతిపురం: అనారోగ్య సమస్యలతో మృతి చెందిన రెండు కుటుంబాలకు ఎమ్మెల్సీ భరత్ రూ.10 వేల చొప్పున శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. మొరసనపల్లె పంచాయతీ కనుమలదొడ్డికి చెందిన విజయమ్మ(65), మఠం పంచాయతీ గంగతిమ్మనపల్లెకు చెందిన చంగమ్మ(57) మరణించారు. మృతుల కుటుంబ సభ్యులకు పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, మొరసన్నపల్లె సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ ఆర్ముగం, మఠం సర్పంచ్ మురళి తదితరుల చేతుల మీదుగా ఈ సాయం అందజేశారు.

మోటార్ సైకిళ్లు ఢీ: యువకునికి స్వల్పగాయాలు


యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సర్పంచ్ మోహన్‌నాయక్

రామకుప్పం: రామకుప్పం–రాజుపేట రోడ్డు మార్గమధ్యంలో మిట్టపల్లె సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. గుర్తు తెలియని యువకునికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న పెద్దతండా సర్పంచ్ మోహన్‌నాయక్ క్షతగాత్రుని పరామర్శించారు. ఆయన సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ఆ యువకుడిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పంట నమోదు వంద శాతం పూర్తి చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ అమరనాథ్

రొంపిచెర్ల: పంట నమోదు వంద శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ అమరనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జిలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 69 శాతం మాత్రమే పంట నమోదు చేశారని, శనివారం సాయంత్రం లోపు వంద శాతం పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు, వీఆర్ఏలు కలసి ఈ పని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ వెంకటరమణా రెడ్డి, ఏఎస్ఓ రాజేశ్వరి, ఆర్ఐ అబ్దుల్ ఖాదర్, సిబ్బంది పాల్గొన్నారు.

25లోపు పంట నమోదు..

శాంతిపురం: మండలంలోని రైతులందరూ ఈ నెల 25 లోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. వ్యవసాయ, ఉద్యానవన, మల్బరీ రైతులు బయోమెట్రిక్‌తో సహా పంటల నమోదు చేసుకోవాలన్నారు. పంటల బీమా, పంట రుణాలు, రైతు భరోసాలకు ఈ–క్రాప్ వివరాలు అనుసంధానం అవుతాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, గ్రామ వలంటీర్ల ద్వారా పంట నమోదు చేసుకోచ్చన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట జెడ్పీ హైస్కూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అండర్–14, అండర్–17 విభాగంలో మండల స్థాయి బాల బాలికలకు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని 14 స్కూళ్ల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని హెచ్ఎం రత్నమ్మ తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామోపాధ్యాయులు హరి, కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

జోరువానలో నిమజ్జనం


రామకుప్పం: జోరువానలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

రామకుప్పం: స్థానిక శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేశారు. సాయంత్రం జోరువానలో పురవీధుల్లో డప్పువాయిద్యాల హోరు నడుమ యువకుల కేరింతలతో వినాయక విగ్రహాన్ని ఊరేగించారు. ప్రజలు విగ్రహానికి పూజలు చేశారు. స్థానిక పెద్దచెరువులో నిమజ్జన కార్యక్రమం ముగించారు.


సదుం: సందడి చేస్తున్న యువకులు

గొంగివారిపల్లెలో..

సదుం: మండలంలోని గొంగివారిపల్లెలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

పాలు కారుతున్న వేపచెట్టు!

- చెట్టు వద్దకు జనం పరుగు
- సోషల్ మీడియాలో వైరల్


గవి మఠం వద్ద వేపచెట్టు నుంచి కారుతున్న పాలలాంటి ద్రవం

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట గవి మఠం వద్ద ఓ వేపచెట్టు నుంచి పాలు కారుతుండటం శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఇది ఆ నోటా ఈ నోటా పాకడంతో తెగ వైరల్ అయ్యింది. వివరాలు..గవి మఠం వద్ద వీరభద్రస్వామి ఆలయం దగ్గర ఉన్న ఓ వేప చెట్టు మొదలు నుంచి రెండు మీటర్ల ఎత్తులో చెట్టు నుంచి పాలు కారుతున్నట్లు భక్తులు గుర్తించారు. ఇది దావానలంలా వ్యాపించడంతో తండోపతండాలుగా ప్రజలు అక్కడికి చేరుకుని ఆసక్తిగా తిలకించారు. కొందరు ఆ ద్రవ పదార్థం రుచి చూశారు. పాల లాంటి పదార్థం నురగలా కారడంపై కొందరు ఇది దేవుని మహిమ అని, మరికొందరు ఇది బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పినట్లు జరుగుతోందని ఎవరి తోచినట్లు వాళ్లు వ్యాఖ్యానించారు. పాలు కారుతున్న వేపచెట్టును సెల్‌ఫోన్లలో వీడియో తీసి పలువురు షేర్ చేయడంతో సోషల్ మీడియాలో ఇది వైరల్ అయ్యింది.

సైన్స్ ఏం చెబుతోందంటే..!

మనుషులకే కాదు..చెట్లకు కూడా ఇన్‌ఫెక్షన్లు సోకుతుంటాయి. వేపచెట్టుకు గాయం కలిగితే ఆ ప్రదేశంలో బ్యాక్టీరియా, శిలీంద్రాల వల్ల చిక్కటి ద్రవ రూపంలో..నురగలా పాల లాంటి పదార్థం కారడం సహజం. ఇది కొన్నిరోజులకు దానంతటదే ఆగిపోతుంది. ఇందులో వింతేమీ లేదు.

'ఆయుష్మాన్ భవ' శిబిరానికి స్పందన


రోగికి రక్తపోటును పరీక్షిస్తున్న డాక్టర్

సదుం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ పుష్పకుమారి కోరారు. ఆసుపత్రిలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 322 మంది రోగులకు స్పెషలిస్టులు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో నలుగురిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేసినట్లు మెడికలాఫీసర్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సభ్యులు మురళి, రమాదేవి, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా మహ్మద్ రఫీ



వి.కోట: వి.కోట ఎంపీడీఓగా మహ్మద్ రఫీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తున్న ఏఓ మహేష్ ఏఓగానే ఎప్పటిలాగే ఏఓగా కొనసాగనున్నారు. మహ్మద్ రఫీని ఎంపీపీ యువరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

సీనియర్ న్యాయవాది పీఎంఆర్ మృతి


మోహనరామిరెడ్డి (ఫైల్)

పలమనేరు: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పి.మోహన రామిరెడ్డి(70) శుక్రవారం గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన వీ.కోట మండలం ముదరం దొడ్డిలో శనివారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి స్థానిక బార్‌కౌన్సిల్ సంతాపం వ్యక్తం చేసింది. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సైతం ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పటిష్టంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే


ఇంటింటా చేస్తున్న సర్వేను పరిశీలిస్తున్న సబ్‌యూనిట్ అధికారి

పలమనేరు: మున్సిపాలిటీలో ఇంటింటా చేస్తున్న ×జగనన్న ఆరోగ్య సురక్ష¤ సర్వే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని మండల సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ ఆదేశించారు. పట్టణంలోని టీఎస్ అగ్రహారం, కాకాతోపు, గడ్డూరులో శుక్రవారం దీనికి సంబంధించి చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని రుగ్మతలతో బాధపడుతున్నవారి వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. వచ్చే నెల 17న నిర్వహించనున్న మెగా వైద్య శిబిరంలో వారు వైద్యసేవలు పొందేలా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవల గురించి కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుజాత, సుభాషిణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు 'గురుకుల' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె: జిల్లా క్రీడా పోటీలకు తమ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శోభ తెలిపారు. శుక్రవారం పలమనేరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన నియోజకవర్గ స్థాయి యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, బ్యాడ్మింటన్‌లో ఇద్దరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె చెప్పారు. అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని జ్ఞానసుస్మిత, 7వ తరగతి విద్యార్థిని హిమబిందు, అండర్–19 విభాగంలో అమృత(10 తరగతి), యామిని(9వ తరగతి), అండర్–17 విభాగం బ్యాడ్మింటన్‌లో జాహ్నవి,అస్మిత (10వ తరగతి) ఎంపికయ్యారని తెలియజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ ప్రవీణను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత సహాయ పరికరాలను సద్వినియోగం చేసుకోండి


బాలికకు వైకల్యాన్ని పరిశీలిస్తున్న నిపుణులు

పుంగనూరు: ఉచిత సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ప్రభాకర్‌వర్మ, లావణ్య కోరారు. శుక్రవారం పుంగనూరు భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల మంజూరుకు వైద్యశిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ మదన్‌మోహన్, ఈఎన్‌టి డాక్టర్ సంపూర్ణ, కార్డియాలజిస్ట్ దేవ, ఫిజియోథెరపిస్ట్ హేమలత వారిని పరీక్షించారు. వారికి ఉన్న శారీరక వైకల్యాలను గుర్తించి, ఎవరెవరికి ఏయే ఉపకరణాలు అవసరమో జాబితా సిద్ధం చేశారు. వీల్‌చైర్:1, రొలేటర్స్: 5, సీపీ చైర్స్: 5, సైకిళ్లు: 2, క్యాలిపర్స్:1, స్ప్లింట్స్ :1, హియరింగ్ మిషన్ :18, ఎంఆర్ కిట్ :7 చొప్పున మొత్తం 40 మంది విద్యార్థులకు ప్రభుత్వం తరఫున ఉపకరణాల కోసం నివేదిక పంపినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రెడ్డెన్నశెట్టి, ఐఈఆర్‌పీలు వెంకట్రమణ, అరుణ, నరేష్, రవీంద్ర, సీఆర్‌ఎంటీలు నారాయణస్వామి, శ్రీనివాసులు, వెంకట్రమణ, అంజమ్మ, చిత్ర, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉట్లమాను ఎక్కేందుకు ప్రయత్నించిన యువకులు

● ఉట్లోత్సాహం!

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లెలో శుక్రవారం యువకులు ఉట్లోత్సవం కోలాహలంగా నిర్వహించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా గ్రామంలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం వినాయక ప్రతిమ వద్ద సుమారు 50 అడుగుల పొడవు గల కొయ్యకు ఆయిల్ పూసి పైభాగంలో రూ.5,116 నగదును ఉంచారు. గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు గంటల పాటు ఉట్లమాను ఎగబడడానికి ప్రయత్నించారు. గ్రామానికి చెందిన ఎల్లప్ప ఎట్టకేలకు పట్టుదలతో ఉట్లకొయ్యను పైకి చేరుకుని నగదును సొంతం చేసుకున్నాడు.

అట్టహాసంగా నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ప్రారంభం


యోగా పోటీల్లో విద్యార్థులు


బాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచిన జట్లతో నిర్వాహకులు


పుంగనూరు : క్రీడాపోటీలలో విద్యార్థులు

పలమనేరు: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్–14, అండర్– 17 విభాగాల్లో బాలబాలికలకు బ్యాడ్మింటన్, యోగా పోటీలను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు ప్రారంభించారు. అండర్–17 బాలుర బ్యాడ్మింటన్‌లో బైరెడ్డిపల్లె, పలమనేరు, బాలికల విభాగంలో పలమనేరు, బైరెడ్డిపల్లి విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. అలాగే, అండర్–14 బాలుర విభాగంలో పలమనేరు, పెద్దపంజాణి, బాలికల విభాగంలో బైరెడ్డిపల్లె, పలమనేరు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. ఇక యోగాలో వ్యక్తిగతంగా ప్రతిభ చాటిన వారిని జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్టు ఎంఈఓ లీలారాణి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు నూరుద్దీన్, రమణ, సురేష్, భాను, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పుంగనూరు: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని అక్షర స్కూల్ కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ స్కూలులో క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రీడలు, యోగాపై ఆసక్తి పెంచుకోవాలని, వీటివల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నితిన్, శ్రీనివాసులు, శారద, మహబూబ్‌బాషా, శరవణ, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.